

వసు
వెలిచేటి
సూర్యప్రకాశరావు

"వెంటనే బయల్దేరిరా. ముఖ్యమైన పనుంది." అనే పొడి ముక్కల్తో టెలిగ్రామిచ్చేరు మా వాళ్ళు. 'ఎంత ముఖ్యమైన పనో, ఏంకథో' అనుకుంటూ ఆదుర్దాగా ఆఫీసుకి సెలవుపెట్టి, ఆరాత్రే బయలేరి నాగపూర్‌నించి విజయవాడ వచ్చేశాను.

ఇంటికి చేరుకున్న తర్వాత తెలిసింది, అదంతా పెళ్ళిచూపుల తతంగమని. 'ఇందుకా నన్ను టెలిగ్రామిచ్చి పిలిపించేరు? ఫలాని విషయమని రాస్తే మీ దేంపోయింది? ఏం కొంప మునిగిందోనని నేను వెంటనే ప్రయాణమయ్యాను' అన్నాను మా అమ్మతో.

'ఫలాని విషయమని రాస్తే నువ్వొస్తావుట్రా నాయనా? అమాట కొస్తే గతంలో నువ్వెన్నిసార్లు వాయిదా వెయ్యలేదు? కాని ఈ సారిమాత్రం నువ్వు తప్పించుకు పోలేవు. లలితాంబగా రమ్మాయి లక్షణంగా వుంటుంది. తల్లిదండ్రులకి ఒక్కతే కూతురు. పైగా బి. ఏ. ప్యాసయింది. చాలా తెలివైన పిల్ల. ఇంతకన్నా మంచి సంబంధం దొరకాలంటే మావల్లకాదు' అంది మా అమ్మ.

'అంత అసాధారణమైన సంబంధమన్నమాట' అని ఆశ్చర్యం నటించి, 'ఆ అమ్మాయి బి.ఏ. ప్యాసయి ఎన్నాళ్ళయింది?' అని అడిగేను.

'ఏడాదయింది. నువ్వు చదివిన కాలేజిలోనే చదివిందట; నీకు తెలీదేమో. పేరు దుర్గ. హిందీ లో 'విశారద' కూడా ప్యాసయింది.'

'ఏమో జ్ఞాపకం రావడంలేదు. ఆ అమ్మాయి నాకు జూనియరయి వుండాలి. ఇంతకీ పెళ్ళిచూపులకి మీరు నిర్ణయించిన రోజేది?' అన్నాను.

'రేపు చాలా మంచిరోజు. అందుకేగా టెలిగ్రామిచ్చాం' అంది అమ్మ.

'రేపే ఎందుకుచూడాలి? ఇవేళ గాని, ఎల్లుండిగాని ఎందుకు చూడకూడదు? చూస్తే ఏమవుతుంది? తెల్లటి అమ్మాయి నాకంటికి నల్లగా కనిపిస్తుందా? మధురమైన ఆమె స్వరం గార్దభస్వరంగా మారుతుందా?' అని అడిగేను చిలిపిగా.

'అల్లరి మొదలెట్టేవా?' అంది మా అమ్మ. 'ఎందుకని అడిగితే నేనేమీ చెప్పలేను. మంచిరోజంటే మంచిరోజే. మిగతారోజుల్లో పనులు సవ్యంగా జరుగుతాయనే నమ్మకం లేదు.'

'నాకుతెలీకడుగుతానూ. దేవుడుగారు సృష్టించిన రోజుల్లో కొన్ని మంచివిగానూ, కొన్ని చెడ్డవిగానూ

ఎందుకు మారిపోతాయమ్మా ?' అన్నాను నవ్వుని దాచుకుంటూ.

'నాకు తెలుసు. నువ్విలా అతి తెలివి ప్రశ్నలారంభిస్తే అంతుండదని' అంది మా అమ్మ. 'ప్రయాణంలో బాగా అలిసిపోయావు. కాస్సేపు రెస్టు తీసుకో' అని వెళ్ళిపోయింది.

* * *

నిద్ర లేచేటప్పటికి సాయంత్రం నాలుగయింది. అప్పటికే నేనొచ్చేనని తెలిసి కాబోలు మా పెదనాన్నగారమ్మాయి సీత మా యింటికొచ్చింది. సీత నా కన్నా నాలుగేళ్ళు చిన్న. రెండేళ్ళక్రింతమే పియుసి ప్యాసయి చదువు మానేసింది.

నేను నిద్రలేవగానే, 'అన్నయ్యా వెంటనే బయల్దేరాలి నువ్వు' అంది సీత.

'ఎక్కడికి ?'

'మాయింటికి.'

'క్రిష్ణ ఒడ్డుకి షికారు వెళ్దామనుకుంటున్నాను, రేపొస్తాన్లే' అన్నాను.

'కాదన్నయ్యా. నువ్వు తప్పకుండా రావాలి. ఇవాళే, ఈ సాయంత్రమే రావాలి. దుర్గ నీతో చాలా ముఖ్యంగా మాట్లాడాలంది.'

'దుర్గా? ఏదుర్గ?' ఆశ్చర్యంగా అడిగేను.

'నువ్వు రేపు చూడబోయే అమ్మాయే. నా స్నేహితురాలు కూడాను' అంది సీత.

'చిత్రంగావుందే. ఏంమాట్లాడుతుంది నాతో ?'


'ఏంమాట్లాడాలని అడిగితే చెప్పలేదు. 'మరోలా అనుకోకపోతే ఒక్క అరగంట కాలాన్ని నాకోసం వృధాచెయ్యమని మీ అన్నగారితో చెప్పు' అంది. పైగా మా యింట్లో వాళ్ళంతా 'ఫస్ట్‌షో'కి వెళ్తున్నారు. నిర్భయంగా మాట్లాడుకోవచ్చు' అంది సీత.

నా కిదంతా కొత్త అనుభవంలా అనిపించింది. ఆసక్తికూడా కలిగింది. వెళ్దామనే నిర్ణయించుకున్నాను. ఇద్దరమూ సత్యనారాయణపురం బయల్దేరేం.

దార్లో దుర్గని గురించిన వివరాలు చెప్పింది సీత. దుర్గ స్వతంత్రాభిప్రాయాలు కల అమ్మాయట ఆ మధ్య ఏదో ఒక చక్కటి సంబంధం వస్తే, 'అబ్బాయి పైకి అందంగానే వుంటాడు కాని తెలివి మాత్రం శూన్యం' అని కామెంట్ చేసిందట స్నేహితురాళ్ళ దగ్గిర.

నాకు తెలీకుండానే నాలో పట్టుదల పెరిగింది. 'ఇంత ప్రత్యేకమైన వ్యక్తిత్వం వున్న అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం జీవితంలో చెప్పుకోదగ్గ మలుపు' అనిపించింది.

మేం మా పెదనాన్నగారింటికి చేరుకున్న అరగంటకల్లా దుర్గ వచ్చింది. రూపం దృష్ట్యా చూస్తే ఆమె అందగత్తె అనడంలో సందేహం లేదు. కాని ఆమె కళ్ళలో




మాత్రం ఇతర స్త్రీలలో అరుదైన దృఢత్వం కనిపించింది.

సీత లాంఛనంగా దుర్గని నాకు పరిచయం చేసింది. ముగ్గురం కూర్చున్నాం.

"మీరు నాకు బాగా తెలుసు. కాలేజిలో నేను మీకు జూనియర్ని. జ్ఞాపకం వున్నానో లేనో!" అంది దుర్గ.

ఆమె ధోరణకి ఆశ్చర్యపోయేను. "క్షమించాలి. జ్ఞాపకం రావడం లేదు" అన్నాను.

కాస్సేపు ఎవరమూ మాట్లాడ లేదు.

చివరికి సీతే అంది "ఏమిటిదుర్గా నిశ్శబ్దంగా వుండిపోయావు?"

చిన్నగా నవ్వుతూ "ఎలా ప్రారంభించాలా అని ఆలోచిస్తున్నాను" అంది దుర్గ.

ఆ అమ్మాయి అంత జంకులే


కుండా మాట్లాడగలదని నే ననుకోలేదు.

ఏదో నిశ్చయానికొచ్చినట్టు తల పంకించి, నావైపు తిరిగి అడిగింది దుర్గ! 'చూడండి, పేరొచ్చిన రచయితలు చాలా మంది ఆరంభదశలో తాము రాసిన కథల్నీ, వాటిలోని అభిప్రాయాల్నీ తలుచుకుని తరచూ సిగ్గుపడుతూంటారు మీకు తెలుసా?'

'అవును' అన్నాను నేను. 'అది వాళ్ళ రచనా ప్రగతికి నిదర్శనం కూడాను.'

'మీ కలాంటి అనుభవం అవుతూంటుందా?'

'అంటే...?'

'అంటే, మీ గత రచనల్లో అపరిపక్వత వుందని మీ రెప్పుడైనా అనుకున్నారా ?' అని అడిగింది దుర్గ.

'అనుకోలేదు' అన్నాను.

'ఐతే ఆ రచనల్లో ఏ దృక్పథాన్ని చూపించేరో దాన్ని పూరింకా మార్చుకోలేదన్న మాట' అందామె.

'ఎందుకు మార్చుకోవాలసలు?' అన్నాను.

'చెబుతాను' అని మొదలు పెట్టింది దుర్గ. 'చదువుకునేరోజుల్లో మీరు కాలేజి మేగజైన్లో 'థామస్ హార్డీ' మీద ఒక వ్యాసం రాశారు. అందులో మీరు 'హార్డీ'ని నవలా రచయితగా ఆకాశానికెత్తేశారు. అంతటితో ఆగకుండా, 'హార్డీ'ని 'ప్రపంచానికి వెలుగిచ్చే మేధావిగానూ, అపూర్వసత్యాన్ని చూసిన వేదాంతిగానూ, నిద్రపోయే ప్రపంచాన్ని మేల్కొల్పగల వైతాళికుడిగానూ చిత్రించేరు అవునా ?'

అవునని అంగీకరించేను, ఆమె జ్ఞాపకశక్తికి ఆశ్చర్యపోతూ.

'ఐతే నేనొకటడుగుతాను. హార్డీ గొప్ప రచయితే కావచ్చు కాని నాలుగు విషాదాంతపు నవలలు రాసిన ప్రతివ్యక్తి మేధావి అనగలమా? జీవితంలో దుఃఖాన్ని మాత్రమే చూసే మనిషి వేదాంతి అవుతాడా?' అంది దుర్గ.

చిరునవ్వుతో జవాబిచ్చేను. 'నాలుగు నవలలు రాసి మేధావులయ్యేవాళ్ళ సంగతి నాకు తెలీదు కాని హార్డీ దృక్పథం మాత్రం వాస్తవికమైంది. కఠిన సత్యాలనీ, జీవితంలోని చీకటి మజిలీలనీ హార్డీ సూటిగా చిత్రించేడు. అది అనితర సాధ్యం అనుకుంటాను నేను. కాబట్టి హార్డీని గురించి నేనప్పుడు రాసిందాంట్లో తప్పేమీ లేదు' అన్నాను.

అంతా విని, నిట్టూర్చింది దుర్గ. 'మన యువతరానికి 'పెసిమిజం' ఒక పెద్ద అర్హత అయి కూర్చుంది. కొందరికది హాబీ అయితే కొందరికది అయువుపట్టు. పిటీ ఏమిటంటే మీరు కూడా అదే మొగ్గారు' అంది.

సీత కల్పించుకుని అంది: 'మీ వరస నాకేమీ అర్థం కావడంలేదు. అసలు మీరు సాహిత్యంమీద చర్చ జరపడానికే సమావేశమయ్యారా?'

'ఇప్పుడేమీ ఫరవాలేదు సీతా. ఆమెని మాట్లాడనీ. టాపిక్ చాలా ఇంటరెస్టింగ్‌గా వుంది' అని, 'చెప్పండి' అన్నాను దుర్గవైపు తిరిగి.

'నేను సైకాలజిస్టుని కాను. ఐనా కొన్ని సందర్భాల్లో మిమ్మల్ని గమనించిన తర్వాత మీరొక నిరాశాజీవి అనిపించింది. ఉదాహరణకి కాలేజి వార్షికోత్సవాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. మీ మిత్రులు ఏదైనా పాట పాడమని కోరినప్పుడు మీరు ఎన్నో తెలుగు పాటలుండగా హిందీ పాటనే ఎందుకు ఎత్తుకోవాలి? పోనీ అందులోనైనా కొత్త పాటలన్నీ వొదిలి, సైగల్ పాటనే ఎందుకు ఎన్నుకోవాలి? ఆ సెగల్

పాటల్లోనైనా, దుఃఖాన్ని గొంతు నిండా నింపుకుని, 'చాహ్ బర్ బాద్ కరేగీ హమే' అని ఎందుకు వాపోవాలి?'

'ఆపాట అన్నయ్యకి బాగాయిష్ట మనుకుంటాను అందులో చిత్రం ఏ వుంది?' అంది సీత.

సరే ఇలాగే అనుకుందాం. కాలేజీ నాటకం ట్రాజెడీ అయితేనే గాని యాక్టు చెయ్యనని పట్టు బట్టి కామెడీ వేద్దామనుకున్న తోటి స్టూడెంట్సుని నిరాశపరచటంలో




అర్థంపై ఏమిటి? గా పత్రికల్లో మీ బ్రదర్ అప్పుడప్పుడు రాసే కథల్లోకూడా భగ్నప్రేమలూ, దుష్ట సమాజమూ, ఆత్మహత్యా పరిష్కారాలూ వుంటున్నాయే తప్ప ఒక్కటయినా సుఖాంతం కాదెందు చేత?'

'ఏమో బాబూ, నీ ప్రశ్నలకి మా అన్నయ్యే జవాబు చెప్పుకోవాలి' అంది సీత.

'నేనేదో ఆరోపించడానికే వచ్చేననుకోవద్దు సీతా. మనిషి చేతులలో 'ప్రాగ్మటిక్ అప్రోచ్' చాలా అవసరం. ఊహల్లో తేలిపోవడం, లేని చీకటిని సృష్టించుకుని ఆనందించడం నేను హర్షించలేను' అని ఆగింది దుర్గ.

'నాకు తెలీకుండానే నన్ను గురించి ఇంతగా స్టడీ చేసినందుకు అభినందనలు. ఇంకా ఏమన్నా చెప్పగలరా?' అన్నాను నా మనసులోని ఆందోళనని కనబడనియ్యకుండా.

'ఇలా చెబుతున్నానని మీరు మరోలా అనుకోవద్దు. నిజానికి మీరు డాక్టరో, ఇంజనీరో కావాలని అంతా అనుకున్నారు కాని మీరు 'బియే' తప్ప మరే కోర్సూ చదవనని పట్టుబట్టేరు. పోనీ ఇప్పుడు చేసే వుద్యోగంలోనైనా ప్రమోషన్ కోసం ప్యాసవ్వాల్సిన పరీక్షలకి వెళ్ళడమే లేదు. అచరణవాదులు ప్రవర్తించాల్సిన తీరు కాదిది' అంది దుర్గ సౌమ్యంగా.

'ఐతే ఇప్పుడేమం టారు?' అన్నాను మరేం తోచక.

'నేను మీకు సూచన లివ్వడానికి రాలేదు. కాని నా భవిష్యాన్ని నిర్ణయించు కోవడంలో నేను తొందర పడకూడదు కనుకనే మీ క్లేశమకల్పించేను. నా వుద్దేశంలో మనిషికి ఆత్మవిశ్వాసం ముఖ్యం అది లేక

> ఉన్నపళంగా, రేపు, వొచ్చే వారం, పై నెల, ఆ వచ్చే సంవత్సరం దేశంలో ఎలాటి మార్పులు వస్తాయో చెప్ప గలగడం;
>
> అంత అర్జంటుగానూ,
>
> అవి అలా ఎందుకు జరగలేదో వివరించి చెప్పగలగడం
>
> రాజకీయవాదికి ఉండవలసిన లక్షణాలు
>
> — ఒక అభిమాని.

పోతే నలుగురితోనూ కలిసి తిరగలేం. సంఘజీవులం కాలేం. జీవితంలో పైకిరాలేం. మనలో పేరుకుపోయే పిరికితనాన్ని వొదిలించుకోలేం. ఇవన్నీ నా నమ్మకాలు. ఇంత సూటిగా మాట్లాడటం నాకు కష్టమనిపించినా మాట్లాడక తప్పలేదు. ఇన్నాళ్ళూ మీరు పెంచుకున్న నమ్మకాలని వొదులుకోగలిగితే నేను ముఖ్యంగా సంతోషిస్తాను' అంది దుర్గ.

ఆ అమ్మాయి అంత నిర్మొహమాటంగా నన్ను దుయ్యబట్టడంతో నాకు వుక్రోషం వొచ్చింది 'ఏ నమ్మకాన్నీ నేను వొదులుకోనవసరం లేదు. హార్డీ గొప్పవాడు. సైగల్ విషాదగీతాల్లో నిజమైన సంగీత మాధుర్యం వుంది కామెడీకన్నా ట్రాజెడీలే ప్రేక్షకుల స్మృతిలో ఎల్లకాలం నిలుస్తాయి. ఆత్మవంచనకన్నా ఆత్మహత్యే భగ్న ప్రేమకి తగిన పరిష్కారం. జీవితంలో 'పైకి' రావడానికి నేను నా వ్యక్తిత్వాన్ని చంపుకోనవసరం లేదు. అభిరుచులు కలిసిన ఒక్క స్నేహితుడు నాకు చాలు. నన్నర్థం చేసుకోగల మనుషులే నాకు 'సంఘం.' ఇవన్నీ నా జీవితాంతం నిలిచే నమ్మకాలు. తప్పుగా అర్థం చేసుకునేవాళ్ళకి నా సానుభూతి' అన్నాను ఆవేశంగా. ఐతే ఈ మాటలంటున్నప్పుడు నా గొంతు కొంచెం వణికింది. ఎంత బిగ్గరగా అన్నప్పటికీ మనసులో గుబులుగానే వుంది.

'ఇక వాదన అనవసరం. కాని ఒక్క రిక్వెస్టు. మీ ఆస్తిపాస్తుల్నీ, వుద్యోగాన్నీ చూసి మా వాళ్ళు మిమ్మల్నే 'ప్రిఫర్' చేస్తున్నారు. వాళ్ళని వ్యతిరేకించేపరిస్థితి రాకూడదనుకున్నాను. కాని కుదరలేదు. ఐనా మావాళ్ళకి నా యిష్టాయిష్టాలతో నిమిత్తం లేదు. కాబట్టి, రేపు పెళ్ళిచూపులైన తర్వాత మీరు ఈ పెళ్ళికి అయిష్టత తెలియజెయ్యాలి. ఈమాత్రం సహకరిస్తే మీ కెంతైనా కృతజ్ఞురాల్ని' అంది దుర్గ.

నా మనసులో ఆందోళన రెట్టిం పయింది. 'మీ ధైర్యానికి నే నాశ్చర్యపోతున్నాను. అసలు మీరీ నిర్ణయాని కెలావచ్చారో చెప్ప గలరా ?' అన్నాను.

'క్షమించంచండి. తిరిగి చర్చ పెంచుకోవడం నాకిష్టంలేదు' అంది దుర్గ.

నేను నిశ్శబ్దంగా వుండలేక పోయాను. 'అంటే మీ దృష్టిలో నే నొక నిరాశాజీవినీ, పిరికివాణ్ణీ అన్నమాట' అన్నాను.

దుర్గ మాట్లాడలేదు. 'చెప్పండి. సంశయించనక్కర్లేదు' అని రెట్టిం చేను.

'నా నోటితో చెప్పించితే నేగాని మీకు తృప్తివుండదా?... ఐనా మీ రింత ఆవేశపడటం బాగాలేదు. ఎంత అడదానికైనా కొన్ని అభిప్రాయా లుంటాయని మీకు తెలీకపోవచ్చు. అందుకే ఇంత ఆశ్చర్యమూ, ఆవేశ మూను' అంది దుర్గ.

'ఇలా అవుతుందనుకోలేదు దుర్గా' అంది సీత కించపడుతున్న ట్టుగా.

'నేను మాత్రం అనుకున్నానా?' అంది దుర్గ నిశ్చలస్వరంతో.

నా కక్కడ వుండబుద్ధికాలేదు. లేచి నిలబడి, 'సరే. మీరు కోరినట్టే చేస్తాను' అన్నాను.

'థాంక్స్. ఇంత శ్రమయిచ్చిన ఈ మిత్రురాల్ని నిండుమనసుతో క్షమించాలి' అంది దుర్గ అంగ్లంలో.

'దట్సాల్ రైట్. గుడ్‌లక్ టు యూ' అని గబగబా అడుగులేను కుంటూ వచ్చేశాను.

నా మనసునిండా చికాకు ఆవరిం చింది. మార్పుకోసం, ఏదో థియే టర్లో తెలుగు జానపదం ఆడుతోంతే రెండో ఆటకి వెళ్ళేను. దాంతో వున్న మతి పూర్తిగా పోయినట్ట యింది. మిగతా రాత్రంతా నిద్ర పట్టలేదు. సాయంత్రం జరిగిన సంభాషణ పదేపదే జ్ఞాపకానికొచ్చి మనసు కలతపడింది. 'నేను నిజంగా పిరికివాణ్ణా? పూర్తిగా నిరాశా జీవినా? నా నమ్మకాలన్నీ ఒక అమ్మాయి హేళన చేసేటంత అల్ప మైనవా?' ఆ రాత్రంతా ఇవే ప్రశ్నలు నన్ను వేధించాయి.

తెల్లారేటప్పటికి నూటనాలుగు డిగ్రీల జ్వరం. ఇంట్లో అంతా ఖంగారుపడ్డారు. ఒక్క రాత్రి జ్వరా నికే బాగా నీరసించిపోయాను. మానసిక అనారోగ్యమే అందుకు కారణం అని ఎవరికి తెలుసు? ఎలా గైతేనేం, జ్వరంవల్ల పెళ్ళిచూపుల బాధ తప్పిపోయింది. జ్వరంకూడా మూడురోజుల్లో తగ్గిపోయింది. నాలుగోరోజున తిరిగి ప్రయాణ మయ్యాను. ఆ మర్నాడు 'మంచి రోజ'నీ, 'అమ్మాయిని చూసుకో వచ్చ'నీ బలవంత పెట్టేరు. నాకు 'లీవు' లేదని నచ్చజెప్పి నాగపూర్ వెళ్ళిపోయాను.

* * *

అదే ఏట దుర్గని చూడటానికి రమ్మని రెండు మూడుసార్లు రాశారు

షూవాళ్ళు. ఏవేవో కారణాలు రాసి తప్పించుకున్నాను. అసలు విజయవాడ వెళ్ళడానికే మనసురాలేదు. సీత పెళ్ళికి కూడా వెళ్ళలేక పోయాను. దుర్గని మరిచిపోవాలని ఎంతో ప్రయత్నించేను. కాని సాధ్యం కాలేదు. నిజానికి ఆ అమ్మాయి జ్ఞాపకమే మనసుని వణికించేది. నన్ను గురించి నాకే తెలీని నిజాలని బయటపెట్టగల మనిషంటే ఈ భయం సహజమేమో!

అప్పట్నుంచీ ఆత్మశోధనకి బానిసనైపోయాను నేను నిజంగా అసమర్థుణ్ణని అనుకోవడానికి అహం అడ్డొచ్చేది. ఐనా మనసులో నన్ను నేను శంకించుకుంటోనే వుండే వాణ్ణి. 'అసలు అసమర్థతకి నిర్వచనం ఏమిటి?' అని తరచూ నన్ను నేను ప్రశ్నించుకునేవాణ్ణి.

మానసికంగా ఈ అవ్యవస్థ కొనసాగుతూండగానే నాకు నాగపూర్ నుంచి కలకత్తా ట్రాన్స్ఫరయింది.

కలకత్తా ఆఫీసులో చేరినరోజునే నాకు 'ఆంజనేయులు' పరిచయమయ్యాడు.

'సార్! ఇక్కడికి కొత్తగావచ్చిన తెలుగువారు మీరేనా సార్?' అంటూ నన్ను వెదుక్కుంటూ వచ్చేతతను.

నన్ను నేను పరిచయం చేసుకున్న తర్వాత, 'నా పేరు అంజనేయులు సార్. నాలుగేళ్ళనుంచి ఇక్కడ పనిచేస్తున్నాను. మిమ్మల్ని గురించి ఇందాక ఎవరో చెప్పేరు. కలుసుకుందామని వచ్చేను' అన్నాడు.

'మీ సొంత వూరేది?' అని అడిగేను.

'మాదా? వైజాగ్ సార్.'

'కలకత్తాదాకా వచ్చేశారే ఉద్యోగానికి!' అన్నాను.

'ఏం చేస్తాంసార్? ఎక్కడైనా గొర్రెతోక బెత్తెడేగదా సార్? 'బియ్యే' ప్యాసవగానే ఈ వుద్యోగం దొరికింది వెంటనే బయల్దేరి వచ్చేశాను' అన్నాడు అంజనేయులు.

'నిలబడే వున్నారేం కూర్చోండి' అన్నాను.

'ఫర్వాలేదు సార్' అంటూ కూర్చున్నాడు.

'మెడ్రాస్‌లో కొన్నాళ్ళు పని చేశారేమిటి?' అని అడిగేను.

'ఏం సార్ అలా అడిగేరు?' అన్నాడు అంజనేయులు.

'ఏంలేదు. ప్రతీమాటకీ ఒక 'సార్' తగిలిస్తోంటేనూ...'

'భలేవారే మీరు' అని గలగలా నవ్వేశాడు అంజనేయులు. 'అలవాటయిపోయింది సార్' అని నాలిక్కరచుకున్నాడు.

'ఒక్కరూ వుంటున్నారా? ఫ్యామిలీతోనా?'

'ఫ్యామిలీతోనే సార్. నామిసెస్ కూడా హౌరాలో ఒక ప్రైవేట్ ఫరంలో పనిచేస్తోంది. మా కొక అబ్బాయి సంతానం' అని 'మీ సంగతి చెప్పనేలేదు. ఎక్కడుంటున్నారు?' అని అడిగేడు.

'అలీపూర్‌లో ఓ ఫ్రెండ్ తో వుంటున్నాను. ఇంకా పెళ్ళికాలేదు నాకు' అన్నాను.

'మేం 'సంత్రాగఛీ'లో వుంటున్నాం సార్. రోజూ ట్రెయిన్లో వస్తూంటాను. కొంచెం దూరమే ననుకోండి. కాని అక్కడ అద్దెలు కొంచెం తక్కువ సార్' అన్నాడు ఆంజనేయులు.

అంతలోనే మా తోటి క్లర్కు జ్యోతిర్మయ్‌సన్యాల్ మేం మాట్లాడుకుంటున్న చోటకి వచ్చేడు. అతన్ని చూడగానే, 'వస్తానుసార్, పనుంది' అని అకస్మాత్తుగా లేచి వెళ్ళిపోయాడు ఆంజనేయులు.

'ఒట్టి కంగారుగొడ్డు. అసలు కల్చర్ లేదు. ఇంగ్లీషెక్కడ మాట్లాడాల్సి వస్తుందోనని మాతో అసలు మాట్లాడడు. ఆఫీసు బయట చూసి కూడా చూడనట్టు పారిపోతాడు. ఏదో మెంటల్ కేస్ అనిపిస్తుంది ఒక్కోసారి' అన్నాడు సన్యాల్.

'కాని అతను 'బియే' ప్యాసయేడటగా?' అన్నాను.

'అతను 'బి యే' ప్యాసయాడే గాని ఉద్యోగానికి తగడు. నాలుగేళ్ళ క్రితం సీనియర్ క్లర్కుగా పోస్టయాడు. మొదట్లో ఒకవారం చూసి క్లర్కుగా పనికిరాడని తెలుసుకుని, అడ్రసులైనా సవ్యంగా రాయమని, 'డిశ్పాచ్' బాధ్యత యిచ్చేడు మేనేజరు. అదికూడా సరిగా చెయ్యలేడు. భయంజాస్తి. బొత్తిగా ఆత్మవిశ్వాసంలేదు. ప్యూనుకికూడా బెదిరిపోతాడు. అలాంటివాడు ఎలా నెగ్గుకొస్తాడో ఏమో' అన్నాడు సన్యాల్

వారంరోజుల్లోనే ఆంజనేయుల్ని బాగా అర్థం చేసుకున్నాను. అతనిలాంటి మనుషుల్ని చాలా అరుదుగా చూస్తాం. అతను పేరుకిమాత్రం డిశ్పాచ్ క్లర్కు. అతని కింద పని చెయ్యాల్సిన ప్యూన్ ఎప్పుడూ గైర్‌హాజరే. ప్యూన్ బాధ్యతలుకూడా అతనే చక్కబెట్టుకోవాలి! పని ఎక్కువ తొందరపాటు కూడా ఎక్కువే ఆ తొందరపాటులోనే తప్పులు చేస్తూంటాడు అధికార్లు ఎన్నిసార్లని క్షమిస్తారు? వణికే చేతులతో అతను తరచూ మెమోలు అందుకుంటూంటాడు. వార్నింగులనీ, చీవాట్లనీ తట్టుకోగల దిటవుతనం అతనికిలేదు.

ఒకనాడు మధ్యాహ్నం సన్యాల్ వచ్చి చెప్పేడు: 'ఆంజనేయులు కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. వెళ్ళి చూసిరా.'

"ఏం జరిగింది?" అని అడిగేను ఆదుర్దాగా. "ఏదో అర్జెంటు లెటరు బెంగుళూర్ వెళ్ళాల్సివుంటే బెనారస్ పంపించేడట. ఓ వారంరోజులపాటు తిరిగి తిరిగి ఇక్కడికే వొచ్చిందా వుత్తరం. దాంతో మేనేజరు కోపం పట్టలేక చీవాట్లు పెట్టినట్టున్నాడు" అన్నాడు సన్యాల్.

వెంటనే డిశ్పాచ్ వింగ్ కెళ్ళేను. ఇరవై ఎనిమిదేళ్ళ వయసున్న ఆంజనేయులు టేబిల్ మీద తల ఆన్చి, వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఇద్దరు ప్యూన్లక్కడచేరి వినోదం చూస్తు

న్నారు. నేనతని భుజంమీద చెయ్యి వేశాను.

ఉలిక్కిపడి చూశాను ఆంజనేయులు "చూశారా సార్. ఈసారి తప్పుచేస్తే వుద్యోగంనుంచి తీసేస్తామన్నారు ఇన్నాళ్ళు కష్టపడి పని చేసినా నాకిక్కడ గౌరవంలేదు సార్ వాళ్ళు తీసేసేముందే రిజైన్ చేసిపోతాను" అన్నాడు ఏడుపు దిగమింగుకుంటూ.

"తొందరపడకు ఆంజనేయులూ. ఇప్పుడేమయిందని ఇంత భయపడుతున్నావు? పనిలో కాస్త జాగ్రత్తగావుంటే ఎవరూ నిన్నేమీ అనలేరు రిజైన్ చెయ్యడమంటే మాటలా? తర్వాతి భవిష్యత్తుని గురించి ఆలోచించేవా? ఆవేశపడకుండా నిదానంగా ఆలోచిస్తే నీకే తెలుస్తుంది" అన్నాను అనునయంగా.

అతన్ని రిజైన్‌చేసే వుద్దేశంనుంచి తప్పించేటప్పటికి తలప్రాణం తోకకొచ్చినట్టుయింది. చివరికి అతనే ఒప్పుకున్నాడు "తొందరపడ్డాను సార్. నాకో కుటుంబం వుందన్న సంగతే మరిచిపోయాను. మీరు చెప్పినట్టు ఇకనుంచి జాగ్రత్తగా పని చేసుకుంటాను సార్" అంటూ నన్ను పొగిడేడు కలకత్తాలో నేనొక్కణ్ణే తనకి శ్రేయోభిలాషినన్నాడు నా సలహా చాలా గొప్పదన్నాడు. నన్ను వీలైనప్పుడు తన యింటికి రమ్మని అడ్రసుకూడా యిచ్చేడు. అతని అమాయకత్వానికి నా మనసు ఆర్ద్రమైంది.

♦ ♦ ♦

దాదాపు ఓ నెలరోజుల తర్వాత ఒక ఆదివారం రైల్వేలో పనిచేసే ఒక మిత్రుణ్ణి కలుసుకోవడానికి "సంత్రాగఛీ" వెళ్ళవలసి వచ్చింది. రోజంతా ఆ మిత్రుడితో గడిపి తిరిగి వెళ్దామనుకుంటోండగా ఆంజనేయులు జ్ఞాపకానికొచ్చేడు. అతనికి కనిపించి వెళ్దామని ఇల్లు వెదుక్కుంటూ వెళ్ళేను.

అప్పటికి సాయంత్రం ఆరుగంటలయివుంటుంది. అడ్రసు ప్రకారం ఇంటిముందుకెళ్ళి తలుపు తట్టగానే ఏడాది బిడ్డ నెత్తుకుని ప్రత్యక్షమైంది ఆంజనేయులు భార్య.

"దుర్గా!" అన్నాను సంభ్రమంతో.

"లోపలికిరండి" అంది దుర్గ చాలా సహజంగా.

"యాదృచ్ఛికం" అన్నాను ఆశ్చర్యంనించి తేరుకుంటూ.

"కాని మీరిక్కడే వుంటున్నట్టు నాకు తెలుసు. ఆయన మీ గురించి తరచూ చెబుతూంటారు" అది దుర్గ. ఆయా వచ్చి, బిడ్డని తీసుకెళ్ళింది.

"కూర్చోండి. ఆయన బజారు కెళ్ళారు, వస్తూండాలి."

కూర్చున్నాను.

"దుర్గా" అని వెంటనే, "క్షమించాలి. మీ ఆయన్ని ఏకవచన సంబోధన చెయ్యటమే అలవాటు.

ఆ మాటకొస్తే ఆఫీసులో అంతా మీ ఆయన్ని ఏకవచన సంబోధనే చేస్తారు' అన్నాను కొంచెం హేళనని ధ్వనిస్తూ.

'తెలుసు' అంది దుర్గ నిర్లిప్తంగా.

'తెలుసా? ఐనా చలించడం లేదూ నువ్వు? మరి అప్పుడు చెప్పిన కబుర్లన్నీ ఏమయ్యాయి? మనుషులు ఆచరణవాదులు కావాలన్నావ్. జీవితంలో గెలవాలన్నావ్. సంఘజీవులు కానివాళ్ళెందుకూ పనికిరారన్నావ్. చివరికి యిదేమిటి ఇంత హాస్యాస్పదంగా ప్రవర్తించేవు? ఆంజనేయులా నీలాంటి ఆశయవాదికి భర్త? నమ్మలేక పోతున్నాను' అన్నాను. నాకు పాత ఆవేశం తిరిగి పుట్టుకొచ్చింది.

తాపీగా జవాబిచ్చింది దుర్గ. 'మీరింకా మారలేదని మీమాటల్ని బట్టి అర్థమవుతోంది. మీ మనసు నుంచి చాలా బలహీనతని తొలగించుకోవాలి మీరు. నేనీ పరిస్థితిలో వుండటంచూసి మీరు చాలా ఆనంద పడుతున్నట్టున్నారు. అంతే కాదు. ఈయన్ని పెళ్ళి చేసుకోవడంవల్ల నేనేదో కలత పడిపోతున్నట్టు కనిపిస్తే మీకది కనుల పండువగా వుండొచ్చు.

కాని ఒక్కటిమాత్రం ధైర్యంగా చెప్పగలను.

ఆయన అమాయకులు. నిజమే. కాని పూర్తిగా అమాయకులూ కాక, పూర్తిగా తెలివైనవాళ్లూ కాక త్రిశంకు స్వర్గంలో వేళ్లాడుతూ అల్పజ్ఞానంతో ఆత్మవంచన చేసుకుంటూ, ప్రపంచాని కేదో నేర్పజూసే వాళ్ళకన్నా ఎంతో నయం. మీ దృష్టిలో నేను ఓడిపోయి వుండొచ్చు. అందుకు నేను దుఃఖపడను. గెలిచినా; ఓడినా అది వేరే విషయం. కాని ఆడది కూడా ధైర్యంగా ఆలోచించగలదనీ, విప్లవాత్మక దృక్పథం కేవలం మగవాళ్ళ హక్కు మాత్రమే కాదనీ మీరింకా తెలుసుకోలేక పోయారు. అందుకు నేను చాలా విచారిస్తున్నాను.'

ఆమె స్వరంలోని వ్యంగ్యాన్నీ, చూపుల్లోని దృఢత్వాన్నీ తట్టుకోలేక పోయాను. అది నాకు సాధ్యంకాదు.

ఆంజనేయులు కోసం ఎదురు చూడకుండానే, కాఫీకూడా తీసుకోకుండానే, ఏదో అర్థంలేని కారణంచెప్పి, వెంటనే దుర్గ చూపుల నుంచి పారిపోయి వచ్చేశాను.

□□□